# జాతస్య మరణం ధృవం

నేను అమెరికా వచ్చిన కొత్తల్లో ఒకరోజు పోస్టులో ఓ ఉత్తరం వచ్చింది. "మీ అంత్యక్రియలకి మీరు సిద్ధం చేసుకున్నారా? ఇంకా చేసుకోకపోతే వెంటనే చేసుకోండి. ఇరవై ఐదు శాతం తగ్గింపు ఆలసించిన ఆశాభంగం త్వరపడండి"అని.

"ఇదేమిటి . గుండ్రాయిలాగా వున్నాను.. వీడేమో అంత్యక్రియలకి సిద్ధం చేసుకున్నారా అంటాడు" అనుకుని, మూర్తిగారితో అదే అన్నాను

అమెరికాలో అప్పటికే పదిహేనేళ్ళనించీ వున్న మూర్తిగారు నవ్వి, "మన కిదేదో వింతగావుంటుంది కానీ, ఈ సంస్కృతిలో అది మామూలే. ఆ త్వరపడండి అన్నది అంత్యక్రియలకికాదు. అంత్యక్రియలకి సిద్ధంచేసుకోటానికి. అలా చేయటం వల్ల లాభంవుంది. తమ పిల్లలు అంత్యక్రియలకి ఖర్చుచేయరని కాదు వాళ్ళని ఆర్ధి కంగా బాధ పెట్టటమెందుకని. అందుకని చాలమంది, వాళ్ళ అంత్యక్రియలు ఏ విధం గా జరిపితే వాళ్ళకిష్టమో వీలునామాలో వ్రాసి, దానికయే ఖర్చుని ఇన్‌స్టాల్‌మెంట్ల లో ముందే కట్టేసి, అన్నీ సిద్ధం చేసుకుంటారు అలా చేసే కంపెనీల్లో ఒకటి, మీకా ఉత్తరం పంపించింది. అదిక్కడ సామాన్యంగా జరిగేదే!" అన్నాడాయన.

అవును మరి. అనుమానంగా వున్నప్పుడు ఆలోచించాలి గానీ, గ్యారంటీ గా చావబోయే మనకి ఈ విషయంలో అనుమానమెందుకు. జాతస్య మరణం ధృవం అన్నారు. మన పిల్లల్ని ఈ ఖర్చులనించీ తప్పించటంలో తప్పేముంది. కాక పోతే మనకవి అలవాటు లేదంతే. అమెరికాలో చాలమంది తమ తదనంతరం వారి కళ్ళు గుండె కిడ్నీ లివర్ మొదలైన శరీర భాగాలని విరాళంగా ఇస్తారు కూడాను అంత్యక్రియలకి ముందు హాస్పటల్‌వాళ్ళవి తీసుకున్న తర్వాతే దహనం జరిగేది.

ఒకసారి మా బావగారు కెనడానించి పనిమీద డల్లాస్ వచ్చి వారాంతంలో మమ్మల్ని చూసి పోదామని హ్యూస్టన్‌కి వచ్చారు శనివారం అందరం సరదాగా గడిపాం ఆయన ఫ్లైట్ ఆదివారం మధ్యాహ్నం పదకొండింటికి. ప్రొద్దున్న ఎనిమి దింటికి, "మా స్నేహితుడు అరోరాని చూసి పదేళ్ళయింది. కనీసం ఫోన్‌చేసి హలో చెబుతాను" అని ఫోన్ చేశారు.

ఎవరో ఒక అమెరికన్ ఆవిడ ఫోన్ తీసుకుని, "ఐయామ్ సారీ! మిష్టర్ అరోరా ఇప్పుడే చనిపోయారు. దొడ్లో లాన్ మోవ్ చేస్తూ పడిపోయారు. వెంటనే గుండె ఆగిపోయింది" అంది. మా బావగారి చేతిలో టెలిఫోన్ జారిపోయింది. అది ఎంతో హఠాత్తుగా అందిన వార్తమరి అప్పటికప్పుడు ఇద్దరం అరోరా ఇంటికి వెళ్ళి కాసేపక్కడే కూర్చుని సమయం చాలదని అటునించటే ఎయిర్‌పోర్టుకి వెళ్ళాం.

అలాగే మా స్నేహితుడు రామ్‌కుమార్. ఎప్పుడు ఫోన్ చేసినా ఆయన జాగింగ్‌కి వెళ్ళారనో ఎక్సర్‌సైజ్ చేస్తున్నారనో చెప్పేవారు. అంతేకాదు ఏ పార్టీకి వచ్చినా స్వీట్లు కూడా ముట్టుకునేవాడు కాదు. అంత జాగ్రత్తగా ఆరోగ్యాన్ని

కాపాడుకునే వాడాయన

ఒక శెలవు రోజు, కుటుంబ సభ్యులతో బయటికి పోవటానికి కారెక్క బోతూ అలాగే పడిపోయాడాయన. మరణం అంత ధృవమే అయినా, చెప్పాపెట్టకుండా అలా ఉధృతంగా రావటమే బాధగా వుంటుంది మరి.

భార్యా పిల్లలు ఇండియా వెళ్ళాక, ఒక ఆంజనేయులుగారు రెండు రోజులు ఆఫీసుకి రాకపోయేసరికీ, ఆఫీస్‌లో కొలీగ్స్‌కి అనుమానం వచ్చింది. ఇంతలో కొందరు స్నేహితులుకూడా ఆయన ఫోన్‌లో దొరకకపోతే ఏమయిందో తెలియక ఆయన ఇంటికి వచ్చారు బయట కారు పార్క్ చేసి వుండటంతో వాళ్ళకి ఆయన ఇంట్లోనే వున్నాడని అర్థమయింది. చివరికి పోలీసుల సాయంతో తలుపులు ఒద్దులు కొట్టి చూస్తే, ఆయన మంచం మీద చనిపోయి వున్నాడు. పోస్ట్‌మార్టంలో తేలిందేమిటంటే ఆయన మూడు రోజుల క్రితమే నిద్రలో చనిపోయాడని.

అమెరికాలో ఎవరినీ త్వరగా చనిపోనివ్వరు. ఎంత అవస్థపడైనా, వాళ్ళని బ్రతికించటానికి శాయశక్తులా ప్రయత్నిస్తారు.

అత్యవసరమైన సమయాల్లో పిలిచే ఫోన్ నెంబర్ 911. ఆ నెంబర్‌కి పిలిస్తే, ఆపరేటర్ అడ్రసూ మిగతా వివరాలూ తీసుకుంటున్నప్పుడే, అవసరాన్ని బట్టి ఆంబులెన్సూ, ఫైర్ ఇంజనూ, పోలీసులూ, క్షణాల్లో ఇంటి ముందు వాలుతారు సామాన్యంగా పది నిమిషాల లోపలేవాళ్ళు వచ్చేస్తారు. అత్యవసరమైతే రోడ్డుమీద కాకుండా హెలికాప్టర్‌లో వస్తారు. ప్రతి పెద్ద హాస్పిటల్‌కీ హెలికాప్టర్ వుండటం మామూలే. మామూలు ప్రథమ చికిత్సే కాకుండా, మనిషిని బ్రతికించే కొన్ని ఇతర ప్రయత్నాలు కూడా ఇంటి దగ్గరే మొదలయి అంబులెన్స్‌లో కొనసాగుతూ పేషెంటుని హాస్పిటల్‌కి తీసుకువచ్చేదాకా జరుగుతూనే వుంటాయి. రేడియో మెసేజ్‌లో ముందే హాస్పిటల్‌కి అవసరమైన సమాచారం అందిస్తారు కనక, ఆంబులెన్స్ హాస్పిటల్‌కి వచ్చేసరికీ అక్కడ సిద్ధంగావుంటారు. మామూలుగా జరిగే మెడికల్ ఇన్స్యూరెన్స్ కాగితాల కార్యక్రమం పక్కన పెట్టి, ముందు పేషెంట్ సంగతే చూస్తారు.

ఇక్కడ ఎవరయినా చనిపోయిన తర్వాత, జరిగే తతంగం కూడా మన పద్ధతిలోకాక, వేరే రకంగా వుంటుంది.

ఈ మధ్య అమెరికాలోని ప్రతి పెద్ద వూళ్ళోనూ గుడులూ, గోపురాలూ వచ్చాయి. చిన్న వూళ్ళయితే దగ్గరగా వుండే ఒక పెద్ద ఊళ్ళో, కనీసం ఒక గుడి అయినా వుండనే వుంటుంది. కనుక శుభకార్యంగానీ, అశుభకార్యంగానీ మన పద్ధతిలో జరపటానికి ఈ రోజుల్లో ఇబ్బందులేవీ వుండవు.

ఆ మధ్య సూరిబాబుగారు ఫ్రీవే మీద కారులో ఎనభై మైళ్ళ స్పీడులో వెడుతూ, టేప్ రికార్డర్‌లో టేపు మారుస్తున్నప్పుడు, కారు పట్టుదప్పి ఒక పక్కనించి ఇంకో పక్కకి పడిపోయారు. ఆయనక్కడే ప్రాణంపోయింది. పోలీసులు, డాక్టర్లూ వచ్చి ఆయన ప్రమాదంలోనే పోయాడని నిర్ధారణ చేసుకుని, కుటుంబ సభ్యులకి సమాచారం అందించి ఆయన శరీరాన్ని దగ్గరలోవున్న ఫ్యునరల్ హోమ్‌కి తరలించారు

స్నేహితులలో కొంతమంది ఆడవాళ్ళు ఆయన భార్య పక్కన నిలబడి ధైర్యం చెబుతుంటే, మగవాళ్ళు అంత్యక్రియలకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన పదేళ్ళ కొడుకు వాళ్ళమ్మ పక్కనే, ఆవిడని పట్టుకుని కూర్చున్నాడు. సూరి బాబుగారి బాంక్ బాలన్స్‌కూడా ఎక్కువ లేకపోవటంతో, ఇరవై నాలుగుగంటల్లో నాలుగు వేల డాలర్ల సహాయం అందింది. ఆయన గురువారం చనిపోవటం వల్ల, మూడోరోజు శనివారం పదిగంటలకి అంత్యక్రియలకి ఏర్పాటు చేశారు. ఫ్యునరల్ హోమ్‌లో కార్యక్రమం సరిగ్గా పది గంటలకి మొదలయింది. బయటవున్న విజిటర్స్ పుస్తకంలో అందరూ పేర్లు వ్రాసి లోపలికి వెడుతున్నారు.

సూరిబాబుగారి మృత శరీరం హాల్లో ఒక పేటికలో పడుకోబెట్టివుంది. దానికి ముందుగా, నేలమీద ఆ వూరి గుడిలోని పూజారిగారు కార్యక్రమం నడిపిస్తున్నారు. వెనకాల స్టీరియోలో ఘంటసాల పాడిన భగవద్గీత సన్నగా వినపడుతున్నది. పూజారిగారు మంత్రాలతో ఆ కార్యక్రమాన్ని అనుకున్న సమయానికే పూర్తిచేశారు.

ఆయన గురించి, కొందరు తెలుగు మిత్రులు అమెరికన్ మిత్రులూ కొలీగ్స్ మాట్లాడారు. పదేళ్ళవాడే అయినా ఆయన కొడుకు, తనకి వాళ్ళ నాన్న అంటే ఎంత ఇష్టమో ఎందుకు ఇష్టమో చెబుతుంటే అప్పటికే భారంగా వున్న వాతావరణం, ఇంకొంచెం బరువెక్కింది.

ముందు కుటుంబ సభ్యులూ ప్రాణ స్నేహితులూ ఒక్కొక్కరే ఆయన్ని కడసారిగా చూసి ఒక పువ్వుని ఆయన శరీరంమీద వుంచి నమస్కారం చేసి వెనక్కి వస్తున్నారు. తర్వాత ఆ హాల్లో కూర్చున్న అందరూ ఒక్కొక్కరే బెంచీలవారీగా లేచి, లైనులో నిలబడి, కడసారి దర్శనం చేసుకున్నారు.

అక్కడినించీ ముందు ఆయన పేటికవున్న వ్యాన్, వెనక కుటుంబ సభ్యులున్న కారు, తర్వాత మిగతా కార్లు బరియల్ గ్రౌండ్‌కి (స్మశానం) బయల్దేరాయి. బయల్దేరబోయే ముందు మోటర్ సైకిళ్ళ మీద వున్న ముగ్గురు పోలీస్ ఆఫీసర్లలో ఒకతను వచ్చి, అది పగలే అయినా అన్ని కార్లకీ హెడ్ లైట్లు వేయమనీ, ఎమర్జన్సీ ఫ్లాషింగ్ లైట్లని కూడా వేయమనీ చెప్పి వెళ్ళాడు. ఆ ముగ్గురు పోలీసులూ మా కార్లు వూరేగింపులా వెడుతున్నంత మేర, ట్రాఫిక్ ఆపేస్తూ, అన్ని కార్లనీ నాలుగు మైళ్ళ దూరంలో వున్న స్మశానానికి తీసుకువెళ్ళారు. అక్కడ ఎలక్ట్రిక్ క్రిమటోరియంలో కార్యక్రమం పూర్తయింది.

ఇదంతా ఎందుకింత వివరంగా వ్రాశానంటే, ఇక్కడి పద్ధతులు తెలుస్తాయని. అమెరికన్ సంస్కృతినీ, మన సంప్రదాయాన్నీ కలిపి మనవాళ్ళు వాటిని ఎలా ఉపయోగిస్తున్నారో చూపిద్దామని.

ఏది ఏమైనా - జాతస్య మరణం ధృవం.

అది అర్థంచేసుకుని, వున్ననాలుగురోజులూ నలుగురికీ సహాయం చేస్తూ బ్రతికితే, మన జ్ఞాపకాలు తీయగా మిగులుతాయి.

* * *